తెలుగు కళా సమితి (న్యూజెర్సీ) ఉగాది మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన రచన.

# మమటల త్రాల
# రోజనాల అంజనానందం

శ్రావణ మాసం తెలుగింటి ఆడ పడుచులను ఆనంద డోలికల్లో వూగిస్తుంది. కన్నె పిల్లలూ, కొత్త పెళ్ళి కూతుళ్ళూ మంగళ వారాల్లో మంగళ గౌరీ వ్రతమూ, శుక్రవారాల్లో వరలక్ష్మీ వ్రతమూ చేసుకుంటారు.

మంచి మొగుడు కావాలని కన్నె పిల్లలూ, చేసుకున్నవాడు పది కాలాల పాటు చల్లగా వుండి తమ పసుపు కుంకుమలు, ఐదోతనము, నిత్యమూ, సత్యమూ కావాలని వివాహితలు కోరుకుంటారు.

ఉదయంపూట తలంట్లూ, పూజలూ, సాయం సమయాల్లో పేరంటాలూ, పట్టు చీరల సింగారాలు- వీథులన్నీ ఎంతో సందడిగా వుంటాయి ఈ తెలుగు నాట.

గ్రీష్మం వెళ్ళి శ్రావణం రావటం వల్ల "బ్లేజ్ వాడ"గా ప్రసిద్ధిపొందిన విజయవాడ ఆ రోజు సాయంత్రం కాస్త ఆహ్లాదకరంగా వుంది. పేరంటానికి వెళుతున్న కొత్త పెళ్ళి కూతురులా, చల్లని పిల్లగాలి మెల్లగా వీస్తోంది కృష్ణానది మీది నుంచి.

రాజ్యలక్ష్మమ్మగారు గదిలో నుండి హాల్లోకి వచ్చారు. కొడుకు తెచ్చిన కొత్త చీర కట్టుకుని, తలలో ఒక మందారం తురుముకొని, యాభై మూడు వసంతాల వయసుతో వచ్చిన నిండుతనంతో సాక్షాత్తు మంగళ గౌరీ దేవిలా నట్టింట్లో నిలబడి - "రమా- నేనలా సరస్వతమ్మగారి యింటిదాకా వెళ్ళొస్తాను-తలుపేసుకో" అంటూ కాస్త పెద్దగానే చెప్పారు. అప్పుడే నిద్ర లేచిన భర్తతో కబుర్లు చెబుతున్న రమ హాల్లోకి వస్తూ ప్రశ్నార్థకంగా చూచింది అత్తగారిని.

"శ్రావణ మంగళవారం కదూ! సరస్వతమ్మ కూతురు నోములకు పుట్టింటికి వచ్చిందట. పేరంటానికి వెళ్ళొస్తాను" అన్నారు రాజ్యలక్ష్మమ్మగారు.

"నేనూ వస్తానత్తయ్యా! చిన్నాళ్ళయిందో పేరంటానికి కంటూ వెళ్ళి- ఒక్క నిమిషం ఆగరాదూ" అంటూనే బాత్‌రూంలో దూరిపోయింది రమ.

హాల్లో సోఫాలో కూర్చున్న అత్తగారి దగ్గరకు పది నిమిషాల్లో ముస్తాబయి వచ్చి "నేను రెడీ! పదండత్తయ్యా" అన్న కోడలు రమ వంక ఆప్యాయంగా ఒక్కసారి చూసుకొని "ప్రయాణం బడలికతో వుంటావు- రాలేనంటావేమోనని, నిన్ను రమ్మనలేదే" అంటూ సంజాయిషీ చెబుతూ సరస్వతమ్మగారి యింటి వైపు దారి తీశారు.

ముంగిట్లోనే ఎదురొచ్చిన సరస్వతమ్మగారు సాదరంగా "రా వదినా" అంటూ ప్రశ్నార్థకంగా రమ వైపు చూశారు. "మా చిన్న కోడలు" అంటూ రాజ్యలక్ష్మమ్మ గారు కోడలి భుజం మీద ప్రేమగా చెయ్యి వేసి పొదివి పట్టుకొని, ఇంకా ఏదో చెప్పబోతూ వుండగానే, బిలబిలమంటూ అరడజను మంది కన్నె పిల్లలు పట్టు లంగాల రెపరెపలతో గుమ్మంలో హడావిడిగా అడుగుపెట్టడంతో ఇంకో వైపుకు వెళ్ళారు సరస్వతమ్మగారు.

హాల్లో పరిచిన తివాచీ మీద పెద్దా, చిన్నా పది మందిదాకా వున్నారు పేరంటాళ్ళు. వచ్చే వాళ్ళు ఇంకా వస్తూనే వున్నారు. ఒక ప్రక్కగా వెళ్ళి కోడలు రమతో సహా కూర్చున్నారు రాజ్యలక్ష్మమ్మ గారు.

సరస్వతమ్మగారి కూతురు ప్రశాంతి ముత్తయిదువ లందరి దగ్గరకూ వస్తూ, వారిని అలంకరిస్తూ, అక్షతలు వేయించుకుంటూ, ఆశీస్సులు అందుకుంటూ మెల్లగా సాగుతోంది.

సరస్వతమ్మగారు మెల్లగా వచ్చి రాజ్యలక్ష్మమ్మ గారి ప్రక్కన కూర్చుంటూ, "చిన్న కోడలన్నావు వదినా, ఎన్నో కోడలు" అంటూ ప్రసంగం ప్రారంభించారు.

"రెండో కోడలు వదినా- మా రామకృష్ణ భార్య" అంటూ రమను పరిచయం చేశారు.

"నమస్కారమండీ పిన్నిగారూ" అంటూ నమ్రతగా జవాబిచ్చిన రమను చూసిన పేరంటాళ్ళు అందరూ మనసుల్లోనే మెచ్చుకున్నారు.

ప్రక్కనే కూర్చున్న పేరంటాళ్ళు కూడా వీళ్ళ ప్రసంగంలో పాలు పంచుకుంటూ, "బెంగుళూరులోనే కదూ వీళ్ళుండేది" అంటూ ఒకామె అడిగింది చనువుగా.



"అచ్చే! బెంగుళూరు వదిలి ఐదేళ్ళయింది. ఇప్పుడు వీళ్ళు అమెరికాలో వుంటున్నారు" అంటూ గర్వంగా చెప్పారు రాజ్యలక్ష్మమ్మగారు. ఆవిడ మొహంలో ఒక వింత కాంతి తళుక్కుమంది.

"అలాగా! అబ్బాయికి ఎందులోనో పని?" అంటూ ఒకామె అంటే, "మా వాడు సైంటిస్టు కదా! ఉపగ్రహాలు తయారుచేసే కంపెనీలో" అంటూ ఆనందంగా చెప్పారు రాజ్యలక్ష్మమ్మగారు. ఆవిడ శరీరంలోని ప్రతి అణువూ కూడా, ఆ ఉపగ్రహాలు తానే తయారుచేస్తున్నంత తృప్తినీ, ఆనందాన్ని పొందుతున్నాయంటే అతిశయోక్తి కాదు.

"మీ వాళ్ళు అమెరికా వెళ్ళి ఎన్నాళ్ళయిందేమిటి" అంటూ ఇంకో పెద్ద ముత్తయిదువ అడిగితే "ఐదేళ్ళయింది పిన్నీ" అంటూ మెల్లగా కళ్ళు తుడుచుకొని "ఇన్నాళ్ళకు వీళ్ళకు ఇండియా రావాలనిపించిందమ్మా" అంటూ నిష్ఠూరంగా అన్నారు రాజ్యలక్ష్మమ్మగారు.

"అదేం లేదండీ! దగ్గరా, దాపా! రావాలంటే మాటలా! సంవత్సరానికోసారి రావాలని మాకూ వుంటుందండీ, కాని ఎలా? సంవత్సరమంతా దాచుకున్న డబ్బు, ఒక్కసారి ఇండియా వచ్చి, వెళితే హూష్ కాకి అయిపోతుందండీ. వీళ్ళందరినీ చూడాలని ఎంత ఆరాటం వున్నా, ఐదేళ్ళపాటు దాన్ని మనసులోనే దాచుకోవలసి వచ్చింది" అంటూ వివరిస్తున్న కోడలి వైపు చూస్తూ—

"ఏడాదికోమారు మీరు వచ్చినా, మనసు ఇలాగే మీ కోసం ఎదురు చూస్తూ వుంటుందే పిచ్చిదానా" అన్నారు రాజ్యలక్ష్మమ్మగారు. మనసు ఆర్ద్రత చెంది, ఆ తడి ఆమె కన్నుల్లో స్పష్టంగా కనిపించింది.

"ఇన్నాళ్ళు అమెరికాలో వున్నారు కదా! ఏ మాత్రం దాచారో" అంటూ దీర్ఘం తీసింది ఓ కోనంగి ఆరా తీయాలన్న కోరికతో. "దాపరికమా! ఏమన్నానా? ఒక ఇల్లూ, ఇంటికి కావలసిన హంగులూ అమర్చుకొనే సరికి ఐదేళ్ళు పూర్తయినయి" అని చెప్పింది రమ.

సరస్వతమ్మగారి కూతురు ప్రశాంతి వీళ్ళ దగ్గరికి రావటం, వరుసగా అందరినీ పూజించి ఆశీస్సులు పొందటం పూర్తయి వాయనాలు ఇస్తోంది. ఒక్క ప్రక్కగా కూర్చొని వీళ్ళ వంకే పరీక్షగా చూస్తున్న దుర్గమ్మగారు "మీ కోడలి పుట్టిల్లు రేపల్లె కదూ!" అంటూ ప్రశ్నించటంతో కొద్దిగా వెటకారం ధ్వనించింది.

ఆనందపు డోలికల్లో తేలిపోతున్న రాజ్యలక్ష్మమ్మగారికి ఆ వెటకారం మనసును తాకలేదు. మామూలుగా "అవునండీ- నారాయణమూర్తిగారి రెండో అమ్మాయే మా కోడలు. మా వియ్యాలవారు మీకు తెలుసా?" అంటూ అడిగారు.

"అయ్యో! తెలీకపోవటమేం! బాగా తెలుసు" అంటూ వత్తి పలికారు దుర్గమ్మగారు. ఆ మాటల్లో వున్న ఏదో వ్యంగ్యం కాస్త మరుక్షణ తగిలింది రాజ్యలక్ష్మమ్మగారి ఎదకు ఓ మూల. రాజ్యలక్ష్మమ్మగారి మౌనం దుర్గమ్మగారిని కాస్త రెచ్చగొట్టినట్టయింది.

"సుమారు పదేళ్ళయిందనుకుంటాను. మేము బందర్లో వుండగా నారాయణమూర్తిగారు మా యింటికి వచ్చారు. ఆ యేడే మా పెద్దాడు బియ్యే పాసయ్యాడు. వాళ్ళ రెండో అమ్మాయిని మా పెద్దాడికి చేసుకోమని మొహమాటపెట్టేశారు. సంప్రదాయం గల కుటుంబం, బాగా వున్న వాళ్ళు కదా అని మొత్తం పది మందిమి వెళ్ళాం పిల్లని చూడ్డానికి." అంటూ కాస్త ఆగి శ్రోతలందరినీ ఓమారు ఓరగా చూశారు దుర్గమ్మగారు. ఈ ప్రసంగం ఎలా మలుపు తిరుగుతుందా అని ఆసక్తిగా చూస్తున్నారంతా.

"తీరా వెళ్ళాక చూడబోతే పిల్ల నల్లగా, పీలగా, ఎలక పిల్లలా వుందనుకోండి. వెళ్ళిన వాళ్ళం అవాక్కయిపోయాం. ఇహ మా పెద్దాడు ఆముదం తాగిన మొహం పెట్టేశాడు. పిల్ల నచ్చితే, కట్నకానుకల విషయంలో ఏమీ లోపం చేయనండీ అంటూ పాపం నారాయణమూర్తిగారు ఎంతో జాలిగా అన్నారు కూడా మా వారితో. ఏదో అయిపోయింది. ఈ పదేళ్ళలో ఈ అమ్మాయి కాస్త రంగు మారినట్టుంది" అంటూ ముగించారు దుర్గమ్మగారు.

"ఈ దుర్గమ్మకు ఎప్పుడు, ఎలా మాట్లాడాలో తెలియదు" అని ఒకరూ, "ఏం కాదు! ఆవిడ బుద్దే అంత" అని ఇంకొకరు, "అయినా, ఇన్నేళ్ళ తరువాత ఈ ప్రసంగం తేవటం ఆవిడ లేకితనం కాక మరేమిటి" అని మరొకరు, "ఈ దుర్గమ్మ మాటల్లో ఎంత విషం కక్కిందో" అని ఒకరు, ఇలా అందరూ గుసగుసలాడుతున్నారు.

ఈ తెల్లాంటి దుర్గమ్మగారి మాటలతో చైతన్యం లేని బొమ్మలా అయిపోయింది రమ. నిమ్మకు నీరెత్తినట్టు ప్రశాంతంగా వున్నది ఒక్క రాజ్యలక్ష్మమ్మగారే!

అమెరికా నుండి ప్రయాణం చేసి, తనూ, భర్త, పిల్లలు ఉదయమే విజయవాడ చేరారు కదా! హాయిగా విశ్రాంతి తీసుకోక, ఈ పేరంటానికి ఎందుకొచ్చినట్టు అని గాయపడిన రమ మనసు పరితపిస్తోంది.

"చూడు దుర్గమ్మా!" అంటూ గంభీరంగా వున్న రాజ్యలక్ష్మమ్మగారి పిలుపుతో హాలంతా నిశ్శబ్దమై పోయింది. ఆవిడ స్వరం దృఢంగానూ, నిశ్చలంగానూ వుంది.

"మీ పెద్దాడు ఏం చేస్తున్నాడూ!" అని అడిగారు రాజ్యలక్ష్మమ్మగారు.

"మా వాడికేం! బియ్యే పాసయ్యేక ఆరు మాసాలకే కరెంటాఫీసులో వుద్యోగం వచ్చింది. హాయిగా వున్నాడు. ఆ యేడే పెళ్ళి కూడా చేశాం" అంటూ చెప్పారు దుర్గమ్మగారు.

రాజ్యలక్ష్మమ్మగారు మెల్లగా లేచారు. వాయనాలు వున్న జేబురుమాలు ఒక చేత్తో పట్టుకుని, రెండో చేత్తో రమను లేవదీసి ఒక్కొక్కమాట స్ఫుటంగా ఇలా అన్నారు:

"ఇంజనీరింగ్‌లో ఎం.ఇ. పట్టా పుచ్చుకొని, రిసెర్చి చేసి, అమెరికా దేశంలో పెద్ద సైంటిస్టుగా వున్న నా కొడుకు రామకృష్ణకు భార్యగా, ఎయిర్ కండిషన్ చేసిన యింట్లో, పిల్లలతో సుఖంగా వుండాలని దాని నుదుట బ్రహ్మ వ్రాస్తే, మీ పెద్దాడికీ, నీకూ ఈ పిల్ల ఎలా నచ్చుతుంది చెప్పు" అంటూ విసవిసా నడిచి వెళ్ళిపోయారావిడ. వెనకే వూరడిల్లిన కోడలు! ●

## మిథ్యా!

నేను
శ్మశానానికి ప్రయాణమవుతున్న
శవాన్ని చూస్తున్నప్పటి
ఆలోచనలా వున్నాను!
ఆ
ఆలోచన
ఆకాశానికి
బంధువు!
జీవితం
గడ్డిపరకపై
నిలిచిన
మంచు బిందువు!!

—పాయసం సుబ్రహ్మణ్యం